ప్రజాశక్తి

శుక్రవారం 12 ఏప్రిల్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో...!

◆ హనుమంతువాక ఫ్లైఓవర్‌పై మాట తప్పిన జగన్ ◆ నగరంలోని మిగిలిన చోట్లా అంతే..

◆ పెరుగుతున్న ప్రమాదాలు ◆ పదేళ్లుగా ప్రతిపాదనలకే పై వంతెనలు పరిమితం

గురువారం హనుమంతువాక వద్ద బారులు తీరిన వాహనాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగర వాసులను అవస్థ పెడుతున్న సమస్యల్లో ట్రాఫిక్ ఒకటి. ఇది రానురానూ జఠిలమవుతోంది. వాహనాలు వందల రెట్లు పెరిగినా ప్రభుత్వాలు ఏళ్ల తరబడి ఇక్కడ ఫ్లై ఓవర్ల నిర్మాణాల పట్ల నిర్లక్ష్య ధోరణితోనే వ్యవహరిస్తున్నాయి. 2022 జులైలో విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సమక్షంలో ట్రాఫిక్ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. హనుమంతవాక జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఒక పెద్ద సమస్యగా తయారైందని జగన్ చెబుతూ ఈ వేదికపై నుంచే రూ.40 కోట్లను అక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సభా ప్రాంగణంలో చప్పట్ల వర్షం కురిసింది. ఆ సభలో పాల్గొన్నవారంతా కేరింతలు కొట్టారు. కానీ ఇప్పటికీ ఆ జంక్షన్ వైపు ఇంజినీరింగ్, నేషనల్ హైవే అధికారులు కన్నెత్తి చూడలేదు.

ప్రమాదాలూ అధికమే

హనుమంతువాక వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మరలా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ విపరీతమైన రద్దీ నెలకొంటోంది. టూ, ఫోర్ వీలర్లతో హనుమంతవాక జంక్షన్ భయం గొలిపేలా ఉంటోంది.. వేల కొద్దీ వాహనాలు వెళుతూ వస్తూనే ఉన్నాయి. చిన్న చిన్న ప్రమాదాల నుంచి పెద్ద ప్రమాదాలకు ఇదో కేంద్రంగా ఉంది. ఇది నాలుగు రోడ్ల జంక్షన్ కావడంతో రద్దీ అధికంగా ఉంటోంది. ఇక్కడ నుంచే సింహాచలం వైపు బిఆర్‌టిఎస్ రోడ్డులోకి వందల వాహనాలు వెళ్తుంటాయి. ఈ జంక్షన్‌కు ఆనుకునే డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ సిటీ హబ్ ఉంది. అక్కడ పలు ప్రధాన ఆసుపత్రులు మిగతా 2లో..

మాట్లాడుతున్న సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు

సిఎఎను అమలు చేస్తున్న...

బిజెపిని, దాని మద్దతుదారులను ఓడించండి

- సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు

దేశంలో సిఎఎను అమలు చేస్తున్న బిజెపిని, దానికి మద్దతునిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. రంజాన్ సందర్భంగా ఆయన గాజువాకలో గురువారం ముస్లిం సోదరులను కలుసుకొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం మతతత్వాన్ని ఎలా రెచ్చగొడుతోందో వివరించారు. గాజువాక సమస్యల పరిష్కారానికి, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూర్మన్నపాలెం, రావులచెరువు పరిసర ప్రాంతాల్లోనూ జగ్గునాయుడు పర్యటించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. (వార్త 4లో..)

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

▶ వార్త మెయిన్‌లో..

ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి

▶ వార్త 8లో..

తుపాకీతో కాల్చుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య

▶ వార్త మెయిన్‌లో..

విశాఖ వన్‌టౌన్ ఏరియాలో నమాజ్ చేస్తున్న ముస్లిములు

భక్తిశ్రద్ధలతో రంజాన్

పలుచోట్ల సేవా కార్యక్రమాలు వార్త 5లో..

మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ముఖ్యంగా సూరత్ - బ్రహ్మపూర్ - సూరత్, నాగర్‌కోయిల్ - డిబ్రూగఢ్ - నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని భావించింది. గురువారం రైల్వే అధికారులు అందించిన వివరాల ప్రకారం.. 09069 సూరత్-బ్రహ్మపూర్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26 తేదీలలో మధ్యాహ్నం 14.20 గంటలకు సూరత్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20:10 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 20.12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి (మూడో రోజు) 01.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. 09070 బ్రహ్మపూర్ - సూరత్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21 28 తేదీలలో ప్రతి బుధవారం తెల్లవారుజామున 03.30 గంటలకు బ్రహ్మపూర్ నుంచి బయలుదేరి, అదేరోజు రాత్రి 08:20 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా మిగతా 2లో..

నగరంలో రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు పర్యటన

◆ గాజువాక ఆర్ఓ కార్యాలయం, కంట్రోల్ రూమ్ సహా పలుచోట్ల తనిఖీలు

రికార్డులను పరిశీలిస్తున్న రామ్మోహన్ మిశ్రా

ప్రజాశక్తి - విశాఖపట్నం : రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా గురువారం విశాఖలో పలుచోట్ల పర్యటించారు. రాజమండ్రి నుంచి రోడ్డు మార్గం ద్వారా జిల్లాకు చేరుకున్న ఆయన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అగనంపూడి వద్ద కలిసి సాదర స్వాగతం పలికారు. అనంతరం పరిశీలకులు అగనంపూడి వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అధికారులు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. అక్కడ నుంచి గాజువాక ఆర్ఓ కార్యాలయానికి చేరుకొని అక్కడ పరిస్థితిని గమనించారు. కంట్రోల్ రూంను పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తనిఖీ కేంద్రం, గాజువాక పరిధిలో తీసుకున్న చర్యలు, అధికారుల నియామకం గురించి జిల్లా కలెక్టర్ పరిశీలకులకు వివరించారు.

అనంతరం పరిశీలకులు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకోగా అక్కడ ఆయనకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ క్రమంలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో...!

ఉన్నాయి. శ్రీకాకుళం, విజయనగరం నుంచే కాకుండా ఈ హైవే అంతర్రాష్ట్ర రహదారిగా కూడా ఉంది. ఒడిశా, రాయగఢ్, ఛత్తీస్‌గఢ్, భువనేశ్వర్ నుంచి వాహనాలు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. ఆనందపురం - అనకాపల్లి రహదారి సిద్ధమయ్యాక భారీ వాహనాలు కొంత తగ్గినా ఇంకా వాహనాల ఫ్లోటింగ్ హనుమంతవాక పై నుంచి సాగుతూనే ఉంది. రోడ్డు రవాణా శాఖ అధికారుల నివేదిక ప్రకారం గడచిన పదేళ్లలో సుమారు 500 శాతం వెహికల్స్ విశాఖ సిటీలో పెరిగాయి. కానీ ఫ్లైఓవర్లు, రోడ్డు సదుపాయాలు మాత్రం అందుకు తగ్గట్టు లేవు.

డిపిఆర్ దశలోనే జివిఎంసి ప్రతిపాదనలు

జివిఎంసి ఇంజినీరింగ్ విభాగపు అధికారులు నగరంలోని గాజువాక, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, హనుమంతవాక, కార్‌షెడ్ ప్రాంతాల్లో పై వంతెనల కోసం 2020లోనే డిపిఆర్‌లు సిద్ధం చేశారు. 2023-24 జివిఎంసి బడ్జెట్‌లో అంచనాలూ వేశారు. కారణాలేమైనా పై వంతెనలన్నీ ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. గడిచిన కాలంలో ఒక్క ఎన్ఎడి వద్ద మాత్రమే ఫ్లైఓవర్ పూర్తయి ప్రారంభానికి నోచుకుంది. మిగిలిన చోట్ల పదేళ్లుగా పై వంతెనలకు మోక్షం లభించలేదు. గత టిడిపి, ప్రస్తుత వైసిపి నగర వాసుల ట్రాఫిక్ కష్టాలను పరిష్కరించేందుకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. దీంతో నగరంలో రోజురోజుకూ ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రజల రాకపోకల సమయం పెరుగుతోంది.

నగరంలో రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు పర్యటన

పరిశీలకులు కలెక్టరేట్ కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన వివిధ కంట్రోల్ రూమ్‌లను, అనుమతి జారీ కేంద్రాలను తనిఖీ చేశారు. సింగిల్ విండో డెస్కు, మీడియా మానటరింగ్ సెంటర్, సోషల్ మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్, ఎంసిఎంసి, ఎక్స్‌పెండీచర్ తదితర కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అధికారులు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. పలు అంశాలపై జిల్లా కలెక్టర్ పరిశీలకులకు క్షుణ్ణంగా వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ర్యాండమైజేషన్, ఫిర్యాదుల నమోదు, తీసుకున్న చర్యలు ఇతర అంశాల గురించి చెప్పారు. జిల్లాలో చేపడుతున్న చర్యలపై సాధారణ పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంసిసి జిల్లా నోడల్ అధికారి, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, కమాండ్ కంట్రోల్ రూం నోడల్ అధికారి, ఇతర నోడల్ అధికారులు ఉన్నారు.

మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

08.22 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.45 గంటలకు సూరత్ వెళ్తుంది. ఈ రైళ్లు నందుబార్, ధరంగావ్, జలగోన్, భూసావల్, అకోలా, వార్ధా, బల్లార్ష, వరంగల్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా ప్రయాణిస్తాయి.

06103 నాగర్‌కోయిల్ - దిబ్రూగఢ్ సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ నాగర్‌కోయిల్‌లో ఏప్రిల్ 12, 26, మే 10 24 తేదీల్లో ప్రతి శుక్రవారం సాయంత్రం 17.45 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 23:18 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 23:20 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 20:50 గంటలకు దిబ్రూగఢ్‌కు చేరుకుంటుంది. 06104 దిబ్రూగఢ్-నాగర్‌కోయిల్ సూపర్ ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ దిబ్రూగఢ్‌లో ఏప్రిల్ 17, మే 1, 15, 29 తేదీలలో ప్రతి బుధవారం రాత్రి 19:55 గంటలకు బయలుదేరి శుక్రవారం సాయంత్రం 16.28 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 16.30 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 21.30 గంటలకు నాగర్‌కోయిల్ వెళ్తుంది. ఈ రైళ్లు తిరువతపురం, చెంగనూర్, కొట్టాయం, ఎర్నాకులం టౌన్, అలువా, త్రిసూర్, పాలక్కాడ్, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, కాట్పాడి, రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట్, దువ్వాడ, విజయనగరం, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, దకుని, బర్ధమాన్, రాంపూర్‌హాట్, మాల్దా టౌన్, కిషన్‌గంజ్, న్యూ జల్పాయిగురి, జల్పైగురి రోడ్, మాతభంగా, న్యూ కూచ్ బీహార్, న్యూ అలీపుర్‌దువార్, కోక్రాఝర్, న్యూ బొంగాగౌన్, గ్వోల్‌పరా టువాన్, జాగీరోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

06105 నాగర్‌కోయిల్-దిబ్రూగఢ్ సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 19, మే 03, 17, 31 తేదీల్లో ప్రతి శుక్రవారం సాయంత్రం 17.45 గంటలకు నాగర్‌కోయిల్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23:18 గంటలకు దువ్వాడ చేరుకొని మరల 23:20 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 20.50 గంటలకు దిబ్రూగఢ్ చేరుకుంటుంది. 06106 దిబ్రూగఢ్ - నాగర్‌కోయిల్ సూపర్ ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24, మే 8, 22, జూన్ 6 తేదీల్లో ప్రతి బుధవారం రాత్రి 19:55 గంటలకు దిబ్రూగఢ్‌లో బయలుదేరి శుక్రవారం సాయంత్రం 16.28 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 16.30 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 21.30 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. ఈ రైళ్లు తిరువునంతపురం, చెంగనూర్, కొట్టాయం, ఎర్నాకులం టౌన్, అలువా, త్రిసూర్, పాలక్కాడ్, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, కాట్పాడి, రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, దకుని, బర్ధమాన్, రాంపూర్‌హాట్, మాల్దా టౌన్, కిషన్‌గంజ్, న్యూ జల్పాయిగుడి, జల్పైగురి రోడ్, మాతభంగా, న్యూ కూచ్ బీహార్, న్యూ అలీపూర్ దువార్, కోక్రాఝర్, న్యూ బొంగాగౌన్, గ్వోల్‌పరా టువాన్, జాగీరోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

తూర్పులో వెలగపూడి సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గంలో మళ్లీ వెలగపూడి రామకృష్ణ బాబునే ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి సుజన ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆమె పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు.

చోరీ సొత్తు రికవరీ మేళా

చోరీ సొత్తును చూపుతున్న వెంకటరత్నం

86 ఘటనల్లో 52 కేసులను ఛేదించిన పోలీసులు

భారీగా నగదు, బంగారం, వాహనాలు, మొబైల్స్ స్వాధీనం

బాధితులకు అందజేత : క్రైం డిసిపి వెంకటరత్నం వెల్లడి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలో మార్చి మాసాంతానికి సంబంధించి చోరీ సొత్తు రికవరీ మేళాను నిర్వహించి, బాధితులకు అందజేశారు. గురువారం ఉదయం నగర పోలీస్ కమిషనరేట్‌లో మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి వెంకటరత్నం వివరాలను వెల్లడించారు. విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతనెలలో 86 కేసుల్లో రూ.70,66,680 విలువ గల సొత్తు చోరీకి గురైందని వెల్లడించారు.. వీటిలో 52 కేసులను విజయవంతంగా ఛేదించగా, వాటిల్లో రూ. 37,77,950 విలువ గల సొత్తును రికవరీ చేశామన్నారు. రికవరీ చేసిన సొత్తుల్లో 450 గ్రాముల బంగారం, 99 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక టాటా ఏస్ వ్యాన్, 18 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, మూడు కంటైనర్లు, 8 బ్యాటరీలు, ఒక కంప్యూటర్ సెట్, 85 మీటర్ల కాపర్ కేబుల్, రూ.11.34లక్షల నగదు, 150 లీటర్ల డీజిల్, రూ.56,700 విలువ గల స్క్రాప్ మెటీరియల్ ఉందన్నారు.

కమిషనరేట్ పరిధిలో నేర నివారణకు చేపడుతున్న చర్యల్లో భాగంగా మార్చి నెలలో 703 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. 292 అవగాహన సమావేశాలు నిర్వహించామని, 59 మంది పాత నేరస్థులను బైండోవర్ చేశామన్నారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. రూ.1.12కోట్ల విలువైన 748 మొబైల్స్‌ను రికవరీ చేసి, వాటిని బాధితులకు అందజేశామన్నారు.

ఘనంగా బొత్స ఝాన్సీ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. గురువారం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో మహాత్మ పూలే జయంతి వేడుకలతోపాటు బొత్స ఝాన్సీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక అనాచారాలు, సాంప్రదాయ సమాజపు పెడధోరణులను నిరసించిన పూలే ఆశయాలకు ప్రభావితం కాని రాజకీయ నాయకులుండరంటే అతిశయోక్తి కాదన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా బీసీలను సమాజానికి వెన్నెముకగా భావించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైసిపి ఎంపీ నియోజకవర్గ పరిశీలకులు మళ్ల విజయ్‌ప్రసాద్, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పేడాడ రమణికుమారి, రవిరెడ్డి, రామన్న పాత్రుడు,ఆళ్ల శివగణేష్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తున్న తాను విజయం సాధిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటానని కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి పులుసు సత్యనారాయణ రెడ్డి (సత్యారెడ్డి) అన్నారు. గురువారం మేఘాలయ హోటల్‌లో విశాఖపట్నం పార్లమెంటు పరిధిలోని వివిధ అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సత్యారెడ్డి మాట్లాడుతూ తాను ఎంపీగా నెగ్గితే రైల్వే జోన్ వచ్చేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ దక్షిణ నియోజకవర్గం అభ్యర్థి వాసుపల్లి సంతోష్, తూర్పు నియోజకవర్గం అభ్యర్థి గుత్తుల శ్రీనివాసరావు, గాజువాక అభ్యర్థి లక్కరాజు రామారావు పాల్గొన్నారు.

దక్షిణంలో ఎల్లాజీ ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజ్‌వాదీ పార్టీ తరుపున పోటీ చేస్తున్న ట్రాన్స్‌జెండర్ ఎల్లాజీ గురువారం దక్షిణ నియోజవర్గంలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. కొన్ని ప్రాంతాలలో ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. గత రెండు పర్యాయాలు తామంతా వాసుపల్లి గణేష్ కుమార్‌కు మద్దతు ఇచ్చామని, అయితే ఆయన నియోజవర్గం అభివృద్ధి పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, నియోజవర్గం ప్రజలకు మేలు జరగలేదని అన్నారు. అందుకే ఈసారి ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నానని తెలిపారు.

ముస్లిము సోదరులతో శ్రీభరత్, వంశీకృష్ణ శ్రీనివాస్

రంజాన్ వేడుకల్లో శ్రీ భరత్, వంశీకృష్ణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రంజాన్ పర్వదినం సందర్భంగా గురువారం టిడిపి విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, దక్షిణ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ పాత నగరంలోని పెరి వీధి, కోట వీధిలో జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గఫూర్ (అడ్డుబాయ్) హనీఫ్, చిన్న రెహమాన్, జఫరుల్లా, దానేష్, తాతారావు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE CUM MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT SRIKAKULAM
IA. 1611/2023 in M.V.O.P. /2023

Between:- **Rothu Gowri** ---Petitioner
And:-
Nayana Sankar Reddy & 2 Others ---Respondents

To,
RESPONDENTS:-
R-2: Nayana Satyavati W/o Sankar Reddy, aged 28 years, Hindu, household duties, owner of Car bearing No AP 39 BV 9909, R/at Door No.26-5-175, Panda Veedhi, Purna Market, Near Navarang Theatre, Visakhapatnam, 530 001, Andhra Pradesh.

పై నెంబరు పిటిషన్‌లో మీరు 2వ ప్రతివాది అయి ఉన్నారు. సదరు పిటిషన్‌లో IA1611/2023 in MVOP. /2023లో మీకు నోటీసు అమలు కొరకు **తే 30-4-2024దీ** వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజున మీరుగాని, లేదా మీ తరుపున న్యాయవాది గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10-30ని॥** లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట హాజరు కావలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
బగాది అప్పలనాయుడు, సువ్వారి గడ్డెయ్య
న్యాయవాదులు, శ్రీకాకుళం,
ఫోన్: 9948755197, 9441320595.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE CUM MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT SRIKAKULAM
IA. 1609/2023 in M.V.O.P. /2023

Between:-**Sadasivuni Prameela & another** ---Petitioners
And:-
Nayana Sankar Reddy & 2 Others ---Respondents

To,
RESPONDENTS:-
R-2: Nayana Satyavati W/o Sankar Reddy, aged 28 years, Hindu, household duties, owner of Car bearing No AP 39 BV 9909, R/at Door No.26-5-175, Panda Veedhi, Purna Market, Near Navarang Theatre, Visakhapatnam, 530 001, Andhra Pradesh.

పై నెంబరు పిటిషన్‌లో మీరు 2వ ప్రతివాది అయి ఉన్నారు. సదరు పిటిషన్‌లో IA1609/2023 in MVOP. /2023లో మీకు నోటీసు అమలు కొరకు **తే 30-4-2024దీ** వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజున మీరుగాని, లేదా మీ తరుపున న్యాయవాది గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10-30ని॥** లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట హాజరు కావలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
బగాది అప్పలనాయుడు, సువ్వారి గడ్డెయ్య
న్యాయవాదులు, శ్రీకాకుళం,
ఫోన్: 9948755197, 9441320595.

ఇళ్లపై విద్యుత్ వైర్లు

మేడపై నీటి ట్యాంకులకు సమీపంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలం మామిడిలోవ గ్రామ పంచాయతీలో విద్యుత్ వైర్లు ఇళ్లపై వేలాడుతున్నాయి. ఎప్పుడు, ఎలా ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మామిడిలోవ గ్రామానికి చెందిన బలిరెడ్డి పెంటయ్య (డోర్ నెంబర్ 2-63) ఇంటి మేడపై రెండేళ్ల నుంచి విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ఇంటి యజమాని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎంత వారించినా వినకుండా రోజూ పిల్లలు మేడపైకి వెళ్లి ఆడుకుంటున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. విద్యుత్ వైర్లు మేడ మీద వాటర్ ట్యాంక్‌పై సమీపంలోనే ఉండటంతో రెండేళ్ల నుంచి ట్యాంక్‌ను కూడా క్లీన్ చెయ్యకుండానే వాడాల్సి వస్తోందని చెబుతన్నారు. అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

ఆనందపురంలో దగ్ధమైన పూరిళ్లు

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని ఆనందపురం గ్రామంలో గురువారం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల బమ్మిడి రామలక్ష్మి, సత్యవతి ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో ఉన్న తిండి గింజలు, దుస్తులు అన్నీ దగ్ధమయ్యాయని బాధితులు విలపిస్తున్నారు. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు రూ.5 వేలు నగదుతో పాటు ఒక బియ్యం ప్యాకెట్ అందజేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి బాధితులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

20 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను పట్టుకొని కేసు నమోదు చేశామని కృష్ణదేవిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. గురువారం మండలంలోని చోద్యం గ్రామానికి చెందిన గాడి శ్రీరామ్మూర్తి మద్యం బాటిళ్లను తరలిస్తుండగా కృష్ణదేవిపేట పెట్రోల్ బంక్ వద్ద పట్టుకున్నామన్నారు. ఆయనపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -పిఎం పాలెం : జోన్ - 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పిఎం.పాలెం 11కెవి ఫీడర్ మరమత్తులు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్‌స్టేషన్ ఎఇఇ మండల అప్పలనాయుడు తెలిపారు. విజేత సూపర్ మార్కెట్ ఏరియా, ఎపిహెచ్‌బి కాలనీ, సాంకేతిక కళాశాల ఏరియా, కారుషెడ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఆనందపురం మండలంలోనూ...

ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి సబ్ స్టేషన్ 11 కెవి, వెల్లంకి రూరల్, 11కెవి వెల్లంకి ఇండస్ట్రియల్, 11 కెవి బొడ్డపాలెం ఇండస్ట్రియల్ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫా నిలిపి వేస్తున్నట్లు ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. వెల్లంకి, బొడ్డపాలెం, గారిపేట, గంభీరం ఎపిఐఐసి తదితర ఏరియాలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, గృహ, పారిశ్రామిక వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జనసేన నుంచి వైసిపిలోకి చేరికలు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం ముకుందపురం గ్రామపంచాయతీలో కోట్ల సన్యాసప్పడు ఆధ్వర్యాన యువకులు జనసేన నుంచి వైసిపిలో చేరారు. వారికి భీమిలి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైసిపిలో చేరిన యువత మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి చేసిన కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట్ల రమణ, కోట్ల కోటరాజు, ఎన్ని కృష్ణ, మచ్చ ఆనంద్, మచ్చ నవీన్, మీసాల సూరినాయుడు, కొలగని శంకరరావు, కలిమి రాహుల్, కోట్ల సాయి, బల్లంకి కనకారావు, బొడసింగి బంగారయ్య, కలిమి గంగరాజు, దొంతల శ్రీను, మచ్చ ఆదినారాయణ, శిడగమ అప్పలరాజు దొంతల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

దివీస్‌లో 1110 యూనిట్ల రక్త సేకరణ

రక్తదానం చేస్తున్న దివీస్ ఉద్యోగులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యాన గురువారం సంస్థ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దివీస్ సంస్థ జనరల్ మేనేజర్‌గా ఉన్న కాలంలో సంస్థను అభివృద్ధి పథంలో నడిపించిన సత్య చంద్ర దివి స్మారకర్థం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 1110 మంది ఉద్యోగులు రక్త దానం చేశారు. సంస్థ డైరెక్టర్ ఎస్.దేవేంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వి.రమణ, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన ఎఎస్ రాజా, న్యూలైఫ్, ఎన్‌టిఆర్, రోటరీ, లైఫ్ షేర్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌ల ద్వారా దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. సంస్థ జనరల్ మేనేజర్లు రమేష్‌బాబు, రామకృష్ణ, పున్నారావు, సుబ్బారావు, డిజిఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

పద్మనాభం మండలంలో గంటా ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలంలోని అయినాడ, బొత్సపేట, బి.తాళ్లవలస, లింగన్నపేట, బుడ్డువలస, అగ్రహారం, గద్దపేట, కోరాడ వెంకటాపురం, రేవిడి, రౌతులపాలెం గ్రామాల్లో భీమిలి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్డాఉతూ, మండలంలో ఇనామ్ భూ సమస్యను పరిష్కరించానని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనని గెలిపిస్తే ఇంకా మిగిలి ఉన్న భూముల సమస్యను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం హయాంలో విద్యుత్ చార్జీలు, ధరలు పెరిగి సామాన్యుల జీవనం కష్టతరంగా మారిందన్నారు. సంక్షేమ పథకాలను నడిపించడానికి జగన్మోహన్‌రెడ్డి భారీ స్థాయిలో అప్పులు చేశారని ఆరోపించారు. మద్యాన్ని నిషేధిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రతి వీధిలో మందు వ్యాపారం పెట్టి సొమ్ము చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కె.రమణ, టిడిపి నాయకులు నగేష్‌కుమార్, లీలావతి, నందీశ్వరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు కె.రామస్వామినాయుడు పాల్గొన్నారు.

ఆటంకాలు కలిగించినా అనూహ్య స్పందన

జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు వెంకటప్పడు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గాడు వెంకటప్పడు

ప్రజాశక్తి -భీమునిపట్నం : అధికార పార్టీ ఎన్ని ఆటంకాలు కలిగించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా సరే బుధవారం మజ్జివలసలో జరిగిన టిడిపి సభకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గాడు వెంకటప్పడు అన్నారు. సభను విజయవంతం చేసినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. స్థానికంగా గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజలకు ఉన్న వ్యతిరేకత ఇట్టే స్పష్టమైందని వ్యాఖ్యానించారు. టిడిపి సభకు వెళ్తే సంక్షేమ పథకాలను ఆపేస్తామని బెదిరించడం, తుదకు టిడిపి సభకు అనుమతి ఇవ్వొద్దని స్థల యజమానిపై ఒత్తిడి తెచ్చారంటే అధికార పార్టీ ఏ స్థాయిలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందో స్పష్టమవుతోందన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు విజయం తథ్యమన్నారు. విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు బుద్ధరాజు సత్యనారాయణరాజు, గాడు తాతినాయుడు, గాడు వెంకటనారాయణ, నీలాపు సూర్యనారాయణ, చెల్లూరి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కోరాడ నాగభూషణంపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి- ఆనందపురం : భీమిలి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వేములవలస మాజీ సర్పంచ్ కోరాడ నాగభూషణరావుపై తెలుగుదేశం పార్టీ సస్పెన్షన్ ఎత్తివేసింది. అప్పట్లో పార్టీ నియమ నిబంధనలు పాటించకపోవడంతో చేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్లు తెలుగుదేశం పార్టీ విశాఖ అధ్యక్షులు గండి బాబ్జీ ప్రకటించారు.

రంజాన్ తోఫాను పంపిణీచేస్తున్న గురనాథ్ తదితరులు

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి -పిఎం.పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం గాయత్రీనగర్ జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో కెవిఆర్ కేటరింగ్స్ అధినేత గరే గురునాథ్ ఆర్థిక సహాయంతో 30 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. 5 కిలోల బియ్యం, పంచదార, నెయ్యి, మరిన్ని నిత్యావసర వస్తువులు అందించారు. అనంతరం గురునాథ్ మాట్లాడుతూ, ముస్లిము సోదరులు సంతోషంగా రంజాన్ పండుగను నిర్వహించుకోవాలని రంజాన్ తోఫా అందజేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, కొరగెంజి సూరిబాబు, బాబ్జీ, సంతోషి, ఖరీం, రమణ, పోతిన రాజు, పోతిన నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'రాక్షస పాలనకు చరమగీతం పాడాలి'

ప్రజాశక్తి -పిఎం పాలెం : రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడాలని భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ పిలుపునిచ్చారు. జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం పాలెం సమీపంలో ఉన్న లక్ష్మివానిపాలెంలో సాయిబాబా ఆలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటుచేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గంటా రవితేజ మాట్లాడుతూ, పోతిన రాము ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. భీమిలిలో గంటా శ్రీనివాసరావును, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమిని గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ కేటరింగ్ అధినేత గరె గురునాథ్, వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, నాయకులు రెడ్డి సత్యనారాయణ, కోరగంజి సూరిబాబు, పోతిన రమణ పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ప్రచారం చేస్తున్న కె.కె.రాజు

ఉత్సాహంగా కెకె.రాజు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. స్థానికులను పలకరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. జివిఎంసి 54వ వార్డు పరిధి ఓల్డ్ పోలీస్‌స్టేషన్, 104 ఏరియాలో ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ వల్లా రజినితో కలిసి కెకె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలతో, చిరు వ్యాపారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు, నాయకులు బాకీ శ్యాంకుమార్‌రెడ్డి, ఆళ్ల శివగణేష్, అమర్‌రెడ్డి, అంబటి శైలేష్, చిరంజీవి, దిలీప్, ఎం.శంకర్, రాంబాబు, రవణమ్మ, అచ్యుతరావు, రమేష్, సోమేష్, పారన్న, దంతు, హనుమంతురావు, మోహనరావు, ఎల్లాజి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

46వ వార్డులో...

జివిఎంసి 46వ వార్డు పరిధి కైలాసపురం జంక్షన్, సూరిబాబునగర్ తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కట్టుమూరి సతీష్‌తో కలిసి గురువారం కెకె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, నాయకులు బి.గోవింద్, కె.చిన్న, జి.అప్పారావు, ఎన్.కృష్ణ, దూది నర్సింగ్‌రావు, కె.ఈశ్వర్‌రావు, కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ సందర్శన

సీతమ్మధార రైతు బజార్, జిమ్‌లను గురువారం కెకె.రాజు సందర్శించారు. పలువురు చిరు వ్యాపారులతోపాటు వినియోగదారులతో కొంతసేపు ముచ్చటించారు. కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందించారని, ఈ ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, జివి.రమణి, మురళీకృష్ణారెడ్డి, రాయుడు శ్రీను, ఎం.సునీల్, జ్ఞానేష్, బి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న రమాకుమారి

61వ వార్డులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, జివిఎస్ఎన్.రాజు ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా ఆయన సోదరి, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రమాకుమారి ప్రచారం నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లో గడపగడపకూ వెళ్లి ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ఇన్‌ఛార్జులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పొలమరశెట్టి పుట్టినరోజు వేడుకలు

62వ వార్డు యూత్ లీడర్, బూత్ కన్వీనర్ పొలమరశెట్టి సంతోష్ పుట్టినరోజు వేడుకలు మర్రిపాలెం ఉడా లే-అవుట్ లోని వైసిపి కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 60వ వార్డు ఇన్‌ఛార్జి నరేష్, కనకమహాలక్ష్మి ఆలయ బోర్డు మెంబర్ మల్ల ధనలత, వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి సంతోష్, బిల్డర్ శీను, పత్తిరావు, అంగవర్మ, మనోహర్, భీమజి పాల్గొన్నారు.

సిపిఎంను అమలు చేస్తున్న...

బిజెపిని, దాని మద్దతుదారులను ఓడించండి

సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : భారతదేశంలో సిఎఎ, ఎన్ఆర్‌సి అమలు చేస్తున్న బిజెపిని, దానికి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం, జనసేన, వైసిపిలను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. రంజాన్ సందర్భంగా గాజువాకలో ముస్లిం సోదరులను ఆయన కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, దేశంలో మోడీ ప్రభుత్వం మతతత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యతకు విచ్చు పెడుతుందన్నారు. ఈ దేశంలో మైనార్టీలుగా ఉన్న ముస్లిములు, క్రిస్టియన్లకు రక్షణ లేకుండా హిందూరాజ్యాంగా చేయాలని చూస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయివేటుపరం చేస్తోందని, కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. మహిళలు మైనార్టీల మీద దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క హామీని బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. బిజెపితో అంట కాగుతున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆంధ్ర రాష్ట్ర హక్కులను మోడీ కాళ్ల దగ్గర తాకట్టుపెట్టారని విమర్శించారు. అందుకే ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిని ఓడించి సిపిఎం అభ్యర్థి అయిన తనను గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి రాంబాబు, నాయకులు లోకేష్, సుబ్బన్న, అప్పారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు..

రావులచెరువు ప్రాంతంలో ప్రచారం

ఉక్కునగరం : కూర్మన్నపాలెం లోని రావులచెరువు ప్రాంతంలో సిపిఎం గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడు ప్రచారం నిర్వహించారు. రావులచెరువు చుట్టుపక్కల ప్రాంతాలలో ఓటర్లతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, గంగవరం పోర్టు కాలుష్యం వంటి ప్రధాన అంశాలను అన్ని రాజకీయ పార్టీలూ పట్టించుకోవటం లేదని, ఆ సమస్యలే ప్రధాన అజెండాగా తాము పనిచేస్తామని జగ్గు నాయుడు తెలిపారు. గంగవరం పోర్టు కాలుష్యం వల్ల వేలాది మంది అనారోగ్యం పాలవుతున్నారన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కాకుండా నిష్పక్షపాతంగా సిపిఎం పోరాడుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి వద్ద, కూర్మన్నపాలెంలో మూడేళ్లుగా దీక్షలు కొనసాగిస్తున్నామని తెలిపారు. సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే గాజువాకలో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, యు.రామస్వామి, పివిఎస్‌వి శ్రీనివాసరాజు, ఎం.కృష్ణారావు, దత్తాత్రేయరాజు తదితరులు పాల్గొన్నారు.

రావులచెరువు ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడు

ఒకరిద్దరు పార్టీని వీడినా నష్టమేమీలేదు

ముత్తంశెట్టి

సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్వార్ధంతో ఒకరిద్దరు వీడినంత మాత్రాన పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదని భీమిలి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం ముత్తంశెట్టి శ్రీనివాసరావును తాళ్లవలస పంచాయతీకి చెందిన పలువురు పార్టీనాయకులు కలిసి తమ మద్దతు ప్రకటించారు. మేమంతా వైసిపి వెంటే ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తన విజయాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లవలస పంచాయతీ గొలగాని వారి కల్లాలుకు చెందిన జి.సన్యాసిరావు, రాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం, లోడగలవానిపాలెం పంచాయతీల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. భీమిలి అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కైలాసపురంలో ప్రచారం చేస్తున్న జైభారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనారాయణ

కైలాసపురంలో జైభారత్ నేషనల్ పార్టీ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి కైలాసపురం ప్రాంతంలో జై భారత్ నేషనల్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తనను గెలిపిస్తే ఆ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సమాజంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని, ఓటును టార్చ్ లైట్ గుర్తుపై వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పలుచోట్ల వాసుపల్లి ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ గురువారం పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. జివిఎంసి 33వ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టి బిజెపితో జతకట్టిన రోజే టిడిపి, జనసేనలకు పతనం మొదలైందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ దక్షిణ పరిశీలకులు శ్రీవాత్సవ్, వార్డు నాయకులు పచ్చిరపల్లి రాము, రమేష్, నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్ పాల్గొన్నారు. రంజాన్ వేడుకల్లోనూ వాసుపల్లి పాల్గొన్నారు. వైసిపి మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ముజీబ్ ఖాన్ తదితరులు ఆయనకు శాలువా కప్పి స్వాగతం పలికారు. వన్‌టౌన్ ప్రాంతంలో అంబుసారంగ్ వీధి ఈద్గా వద్ద జరిగిన నమాజ్‌లో వాసుపల్లి పాల్గొన్నారు. ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు.

76వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి గోపాలరెడ్డినగర్, రామచంద్రనగర్, స్వతంత్రనగర్ పరిసర ప్రాంతాల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావును, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, గాజువాక నియోజవర్గంలో వివిధ వార్డుల్లో ప్రజలు ఆదరిస్తున్న తీరు చూస్తుంటే రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు. గతంలో శాసనసభ్యుడిగా గాజువాక నియోజవర్గంలో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించానని తెలిపారు. ఈ ఐదేళ్ల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో వైసిపి కార్యకర్తల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు రాష్ట్రాన్ని విచ్చలవిడిగా దోచుకున్నారని ఆరోపించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వైసిపికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజవర్గం బిజెపి ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, కూటమి నాయకులు ముమ్మన మురళి, జీలకర్ర రమణ, గడసల అప్పారావు, రౌతు గోవిందరావు, ప్రసాదుల శ్రీనివాస్, బొసెట అప్పారావు, తాటికొండ సుదర్శన్, కూన వెంకట్రావు, పంచదార్ల ఉగ్రం, వియ్యపు వెంకన్న, గోమాడ వాసు తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డులో ప్రచారం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

అచ్యుతాపురంలో తీవ్ర విషాదం

బెంజ్ లారీ ఢీకొని ముగ్గురు దుర్మరణం
నష్ట పరిహారం చెల్లించాలని స్థానికుల ఆందోళన
కనికరించని యాజమాన్యం

రోధిస్తున్న బంధువులు

బోరున విలపిస్తుండగా ఓదార్చుతున్న బంధువులు

టెంట్ వేసి ఆందోళన చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం మండల కేంద్రంలో గురువారం స్టార్ జన్ హాస్పిటల్ ఎదుట గురువారం ఉదయం జరిగిన ప్రమాదంలో అచ్యుతాపురం మండలం దుప్పుతూరు గ్రామానికి చెందిన నర్సాల అమల (38), గొల్లపల్లి శేఖర్ (19), జంగులూరు జంక్షన్ సిరి లేఔట్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్న కశింకోట మండలం ఉగినిపాలెం గ్రామానికి దూది జ్యోతి ప్రకాష్ (14) సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందడంతో అచ్యుతాపురంలో తీవ్ర విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని స్థానికులు, దుప్పుతూరు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలంలోనే ఆందోళనకు దిగారు. పోలీసులు చక్రాల కింద పడి ఉన్న మృతదేహాలను క్రేన్ సహాయంతో తీసే ప్రయత్నం చేయగా, అడ్డుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ యాజమానికి గ్రామ సర్పంచ్ దేశం శెట్టి శంకర్రావు, నాయకులు ప్రగడ చిన్న నాగేశ్వరరావు తదితరులు ఫోన్ చేసి మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అయితే యాజమాన్యం స్పందించకపోవడంతో అచ్యుతాపురం, ఎలమంచిలి వెళ్లే ప్రధాన రహదారిని స్తంభింపజేశారు. వాహనాల రాకపోకలను నిలిపివేశారు. రోడ్డుపై టెంట్ వేసి ఆందోళన ఉధృతం చేశారు. అచ్యుతాపురం ఎస్ఐ సిఐ ఎం బుచ్చిరాజు, ఎస్ఐ నారాయణరావు తదితరులు గ్రామస్తులను శాంతింపజేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సాయంత్రం 6 గంటల వరకు సంఘటనా స్థలంలోనే ఆందోళన చేస్తూ చర్చలు జరిపారు. చీకటి పడుతున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో గ్రామస్తులు మృతదేహాలు చెడు వాసన రాకముందే పోస్టుమార్టం నిమిత్తం పంపించడానికి వీలుగా ఆందోళన విరమించారు.

అంది వస్తాడనుకున్న కొడుకు.. అందనంత దూరానికి

ప్రమాదంలో మృతి చెందిన గొల్లపల్లి శేఖర్ ప్రస్తుతం ఐటిఐ చదువుతున్నాడు. చదువు పూర్తయితే ఏదో పరిశ్రమలో ఉద్యోగం చేసి తమను పోషిస్తాడని తల్లిదండ్రులు కలలు కంటున్నారు. ఇంతలోనే శేఖర్ ప్రమాదంలో మృతి చెందడంతో తండ్రి శంకరయ్య, తల్లి నాగలక్ష్మి రోధించారు. తల్లిదండ్రులిద్దరూ కూలి పనులు చేస్తే గాని వారి కుటుంబం గడవదు. అంది వస్తాడనుకున్న కొడుకు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

బతుకుతెరువుకు వచ్చి బిడ్డను కోల్పోయి

మరో మృతుడు దూది జ్యోతి ప్రకాష్ తల్లిదండ్రులు కశింకోట మండలం ఉగినిపాలెం గ్రామానికి చెందినవారు. బతుకుతెరువు కోసం పరిశ్రమలో పని చేయడానికి ఇక్కడి వచ్చి అచ్యుతాపురం మండలం జంగులూరు జంక్షన్ సిరి లేఔట్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. పరిశ్రమల్లో పనిచేసుకుంటూ పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రమాదంలో కొడుకు దుర్మరణం చెందడన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సోమరాజు, రామలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు.

అనాథలైన మేఘన, మిల్కీ

ప్రమాదంలో మృతి చెందిన నర్సల అమలకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె మేఘన ఇంటర్మీడియట్, చిన్న కుమార్తె మిల్కీ 9వ తరగతి చదువుతున్నారు. అమల భర్త కాసులబాబు ఎనిమిది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. భర్తను కోల్పోయిన తరువాత ఆర్థిక స్తోమత లేక కూలి పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను పోషిస్తుంది. ప్రస్తుతం అమల ఎస్‌టిబిఎల్ సినిమా హాల్ పక్కన జ్యూస్ పార్లర్ పెట్టుకొని, దాని ద్వారా ఆదాయంతో కుటుంబ పోషణ చేస్తూ, ఇద్దరు పిల్లలను చదివించుకుంటుంది. అమల ప్రమాదంలో మృతి చెందడంతో ఇద్దరు కుమార్తెలు మేఘన, మిల్కీలు దిక్కులేని బిడ్డలయ్యారు. తల్లిదండ్రులు లేని తమను ఎవరు చూస్తారని, తమకు దిక్కెవరని, తమ పెళ్లిళ్లు ఎవరు చేస్తారంటూ బోరు విలపించారు. వారిని చూసిన వారికి కన్నీళ్లు ఆగటం లేదు. వారిని ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి భరత్‌కుమార్

వైసిపి అభ్యర్థి భరత్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ గురువారం జివిఎంసి 80వ వార్డులో ఆ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గవరపాలెం చిన్న రామస్వామి గుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి అనంతరం చిన్నరామస్వామి కోవెల నుంచి మొదలుకొని వేలంపీఠ, శతకంపట్టు వరకు ప్రచారం చేపట్టారు. భరత్ గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. మే 13న జరగబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బూడి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని భరత్ కుమార్ అభ్యర్థించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు విల్లూరి శివసూరి, కెఎమ్. నాయుడు, బుద్ధ నర్సింహారాజు, డి.నర్సింగరావు, ఎల్లపు చంద్రమోహన్, కొణతాలల కృష్ణంరాజు, పెంటకోట అప్పలనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బయ్యవరంలో...

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్ బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు. ముందుగా కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారంలో పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, ఎంపిటిసి గొన్ని నాగ సత్యనారాయణ, గొల్లవిల్లి నానాజీ, గొల్లవిల్లి బాబూరావు పాల్గొన్నారు.

కొణతాల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవిఎంసీ 84వ వార్డు పరిధి కోట్ని వీధిలో గురువారం కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి తనయుడు రిత్విక్ గడపగడపకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, టిపిపి, బిజెపి నాయకులు పొన్నగంటి అప్పారావు, కోట్ని రామకృష్ణ, కోట్ని కొండలరావు, తలారి లక్ష్మీప్రసాద్, కోట్ని సూరిబాబు, దొడ్డి నాగు, కోట్ని అయ్యన్న దొర, గేదెల స్వరూప్, పెద్ద ఎత్తున కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. అనకాపల్లి గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ ఆత్మీయ కలయికలో ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ కార్మికులతో ఆత్మీయ సమావేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గ్రామాల్లో సుందరపు ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎమ్మెల్యే అసెంబ్లీ నియోజకవర్గం కూటమి అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ గురువారం మండలంలోని జగ్గన్నపేట, కాజీ పాలెం గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేశారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తనను గెలిపించినట్లయితే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సీఎం రాజేష్, బిజెపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ సన్యాసినాయుడు, టిడిపి జిల్లా కార్యదర్శి కేల తులసి రాము, టిడిపి మండల అధ్యక్షులు జనపరెడ్డి నరసింహారావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్

భక్తి శ్రద్ధలతో రంజాన్

అచ్యుతాపురం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని కశింకోట, చింతలపాలెం గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లిములు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముస్లిములు ఒకరినొకరు అలింగణం చేసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బుధవారం సాయంత్రం చంద్రుడు దర్శనం ఇవ్వడంతో ముస్లిములు ఉపవాస దీక్షలు ముగించారు. ఈ వేడుకల్లో అధ్యక్షులు నూరి మసీద్, కార్యదర్శి ఎస్ రహమతుల్లా, ఎంఎం అలీ, ఎం.రబ్బాని, సఫీ రషీద్ ఖాన్, సలీం సయ్యద్ అన్వర్, మన్సూర్ ముస్తఫా, మున్నా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : రంజాన్ సందర్భంగా అచ్యుతాపురంలో మసీదు ఆవరణలో వందలాదిమంది ముస్లిములు ప్రార్థనలు చేశారు. ఎస్ఇజెడ్ పరిశ్రమల్లో పనిచేయడానికి దేశ నలుమూలల నుండి ఇక్కడికి విచ్చేసిన ముస్లింలందరూ అచ్యుతాపురంలో నూతనంగా నిర్మించిన మసీదులో ప్రార్థనలు చేయటానికి తరలివచ్చారు.

జిల్లా ఎస్పి మురళీకృష్ణ శుభాకాంక్షలు

అనకాపల్లి : రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు, పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులు, సోదరీమణులు ప్రశాంతమైన వాతావరణంలో 'ఈద్ ఉల్ ఫితర్' జరుపుకునేందుకు జిల్లాలోని అన్ని మసీదులు, ఈద్గాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు.

మాడుగుల : రంజాన్ సందర్భంగా మాడుగుల కేంద్రంలోని మసీదులో మాడుగుల నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం మత పెద్దలతో ప్రార్థనలు జరిపి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల వైసిపి నాయకులు, మాడుగుల కో ఆప్షన్ మెంబెర్ మహమ్మద్ ఉనీసా బేగం, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండల కేంద్రంలోని రెండు మసీదుల్లో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు రంజాన్ మాసపు పర్వదినం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని ముస్లిం సోదరులు గురువారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. పెదబోదుగల్లం ఈద్గా వద్ద కు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ చేపట్టారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

గొలుగొండ : మండలంలోని ఏజెన్సీ లక్ష్మీపురం గ్రామంలో ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే మసీదుకు చేరుకుని ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంజాన్ విశిష్టతను మత పెద్దలు వివరించారు. అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నక్కపల్లిలో...

టిడిపిలో చేరిన వైసిపి శ్రేణులు

టిడిపి నాయకులతో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు

టిడిపి నేతలను కలిసిన జనసేన అభ్యర్థి

ప్రజాశక్తి - పరవాడ

పెందుర్తి నియోజకవర్గ కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు గురువారం పరవాడ మండలంలో పర్యటించారు. గొర్లెవానిపాలెం మాజీ సర్పంచ్ గొర్లి కనకారావును, మాజీ ఎంపిటిసి యాసరపు కనకారావును, గొర్లివాని పాలెం తెలుగుదేశం నాయకులను, కార్యకర్తలను గౌతులచ్చన్న జంక్షన్‌లో గల గొర్లె కనకారావు ఇంటివద్ద రమేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రిపాలెం మాజీ సర్పంచ్ జెర్రిపోతుల అప్పారావుకు కాలుకు గాయం అవ్వడం వలన లంకెలపాలెంలో గల వారి స్వగృహంలో పరామర్శించారు. తరువాత కన్నూరు టిడిపి మాజీ ఎంపిటిసి నూకాలమ్మను, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, కనకారావు, టిడిపి నాయకులను కలిశారు. అనంతరం పెదముసిడివాడ టిడిపి ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావును, మాజీ సర్పంచ్ బంధం వెంకటరమణను, మాజీ ఎంపిటిసి సాలాపు గోవిందును, టిడిపి నాయకులను కలిశారు. అక్కడ ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన చౌడువాడ ఎస్‌సి కాలనీ వాసులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలం చౌడువాడ గ్రామానికి చెందిన దళిత కుటుంబాల వారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి మాడుగుల టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామంలోని ఎస్‌సి కాలనీ నుంచి 25 కుటుంబాల స్థానిక సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, టిడిపి గ్రామ అధ్యక్షుడు చల్లపల్లి శ్రీను ఆధ్వర్యంలో చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రొంగలి మహేష్, వెలగల పైడం నాయుడు, సిహెచ్.శ్రీను, జనసేన నాయకులు ఉగ్గిన త్రినాధ్, ఎన్.రమణ, ఎం.నాగరాజు, ఎం.శివ, కె.మణికంఠ, జిల్లా దళిత నాయకులు దొమ్మేటి బోస్, రాయి రామారావు, బత్తుల సింహాచలం, అనకాపల్లి అనిత, పారుపల్లి సోమేశ్వరరావు, మల్లారపు నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

తామరబ్బ, చింతలపూడి పంచాయతీల నుండి..

దేవరాపల్లి : మండలంలోని గిరిజన ప్రాంతానికి చెందిన తామరబ్బ, చింతలపూడి రెండు పంచాయతీల పరిధి గ్రామాల నుంచి సుమారు 150 కుటుంబాల వారు వైసిపి నుండి టిడిపిలో చేరారు. వారికి గురువారం టిడిపి కూటమి మాడుగుల అభ్యర్థి పైలా ప్రసాదరావు పాత బొడ్డపాడులో జరిగిన సమావేశంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సీఎం సురేష్ నాయుడు, టిడిపి నాయకులు జడ్డేటి పైడిరాజు, మొసలి తమ్మయ్య, తేడా చిన్నారావు, కడారి శ్రీను, కథరాజు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంటా సమక్షంలో...

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు బుధవారం రాత్రి చోడవరం మండలం ముద్దుర్తిలో జరిగిన టిడిపి ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ ఎంపీటీసీ పాతాళ రమణ, పూడి రామారావు, గాడి పరసయ్య, కోమార గోవింద తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, మాజీ సర్పంచ్ డొంకిన అప్పలనాయుడు, పాల సంఘం అధ్యక్షులు సుంకర బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

అనకాపల్లి : అనకాపల్లి మండలం శంకరం, రేబాక గ్రామాలలో గురువారం జరిగిన సమావేశాల్లో రేబాక గ్రామ సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, మాజీ సర్పంచ్‌తోపాటు పలువురు జనసేనలో చేరారు. వీరికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకష్ణ, ఎంపీ అభ్యర్థి తనయుడు రుత్విక్, మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శంకరం టిడిపి, జనసేన నాయకులు కరణం పవన్ కుమార్, బొండా లక్ష్మీనారాయణ, కుర్రు లక్ష్మణ్, కరణం సన్యాసిరావు, జీకే రాజు, మునస గోవిందరాజు, దేవర అప్పలనాయుడు, మాట్రు లోకేష్, పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ

బిజెపి, టిడిపి నుంచి వైసిపిలో చేరిక

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో గురువారం జరిగిన వైసిపి విస్తృత స్థాయి సమావేశంలో టిడిపి, బిజెపికి చెందిన పలువురు నాయకులు రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, రైతు సంఘం ప్రెసిడెంట్ పీలా బుజ్జి ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. గ్రామానికి చెందిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొలపర్తి శ్రీను, రాష్ట్ర ఓబిసి కార్యదర్శి అలమండ శ్రీను, బిసి రాష్ట్ర కార్యదర్శి నీలగిరి వరహాలు, ఏడిద మహేష్, పిజి నూకరాజు, టిడిపి నాయకులు కొణతాల శ్రీను, చదరం నూకరాజు, పీలా శ్రీను, రామిరెడ్డి, చదరం పోలిశెట్టితో సహా 50 మందిపైగా వైసిపి తీర్థం పుచ్చుకోగా, వారికి అనకాపల్లి నియోజకవర్గ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నేత డాక్టర్ విష్ణుమూర్తి, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ వీల్లూరి సూర్యకుమారి శేఖర్, ఎంపీటీసీలు పంచదారల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వడ్డాది అశోక్ భారతి, పాల సంఘం ప్రెసిడెంట్ సూరిశెట్టి శ్రీను, వైసిపి నాయకులు చదరం చిన్న, పడాల గణపతి, ఏరుబండి సత్యనారాయణ, ముదిరెడ్డి దేవుడి బాబు, కొనసాల శివాజీ, మెగసాల వెంకట్, గొంతున శీను తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించిన సిఐ వినోద్ బాబు

ఎన్నికల్లో వివాదాలకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- కశింకోట

ఎన్నికల వివాదాలకు యువత దూరంగా వుండాలని కశింకోట సిఐ వినోద్ బాబు అన్నారు. మండలంలోని తాళ్లపాలెం గ్రామస్తులకు బుధవారం రాత్రి ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. గ్రామంలో ఎటువంటి సంఘటనలు జరిగినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సేంద్రీయ సాగు పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చయ్య పేట

వ్యవసాయంలో సేంద్రియ సాగు పద్ధతులపై గురువారం మండలంలోని పి.భీమవరంలో శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం అవగాహన కల్పించారు. రైతులందరినీ ఒకచోట సమావేశపరిచి సామూహిక చర్చా వేదిక నిర్వహించారు. పెట్టుబడి తగ్గే విధంగా రైతులకు సాగు పద్ధతులను వివరించారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, కిషోర్ కుమార్, సర్పంచ్ పి.రామనాయుడు, అగ్రి విద్యార్థులు శశికళ, శ్రావణి, పూజిత, పల్లవి, నిఖిత, తేజస్విని, ప్రత్యూష పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

కార్యకర్తలతో కూటమి నేతల సమావేశాలు

మాట్లాడుతున్న మాడుగుల కూటమి అభ్యర్థి పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రంలో గురువారం తెలుగుదేశం పార్టీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కూటమి మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు, అనకాపల్లి అభ్యర్థి సిఎం.రమేష్ సోదరుడు సిఎం.సురేష్ ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించడానికి సమావేశంలో చర్చించారు. వైసీపీ ఓటమే లక్ష్యంగా టీడీపీ విజయమే ధ్యేయంగా అలుపెరగకుండా పని చేస్తామని మండలంలోని 27 పంచాయతీలకు చెందిన టిడిపి కార్యకర్తలు తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ ఎంపీకి కమలం, ఎమ్మెల్యేకు సైకిల్ గుర్తులపై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోతల పాత్రుని నాయుడు, ఎంపీటీసీ రెడ్డి బలరాం, టిడిపి నాయకులు సరకాన సూర్యనారాయణ, కర్రి నాయుడు, చల్లా నానాజీ, గుళ్ళుపల్లి అర్జున్ రావు, గొర్లి దేవుళ్ళు, పెద్దాడ వెంకటరమణ, కొమర బాబూరావు, లెక్కల సత్యనారాయణ, పోడెల బుజ్జి, బొడ్డు జగదీశ్వరరావు, పెనగంటి సింహాచలంనాయుడు, కిల్లి గోవింద కార్యకర్తలు పాల్గొన్నారు

కె.కోటపాడు : స్థానిక తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ మాట్లాడుతూ బిజెపికి చెందిన ఎంపీ అభ్యర్థి, టిడిపి అభ్యర్థి పైల ప్రసాద్‌రావు మండలంలో శుక్రవారం మధ్యాహ్నం పర్యటిస్తున్నారని, దానిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్తి వెంకటరమణ, సబ్బవరం రామనాయుడు, కొఠాన రాము, రెడ్డి దేముడు బాబు, దళిత నాయకులు డాక్టర్ పాళ్తటి పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ విష్ణుమూర్తి

సత్యసాయి పాదుకల 24వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నీలకంఠరావు వీధిలో ఉన్న ఆది భేతాళ రామమందిరంలో గురువారం శ్రీసత్యసాయి పాదుకల 24వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వివేకానంద చారిటిబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. 24 సంవత్సరాలు సేవా కార్యక్రమాలు చేస్తున్న పడాల వెంకట లక్ష్మిని డాక్టర్ విష్ణు మూర్తి, కార్పొరేటర్ పీలా సౌజన్య, రాంబాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి రమణ అప్పారావు, దాడి నారాయణరావు, మళ్ల స్వామి నాయుడు, సాయి భక్తులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పిఎసిఎస్ భవనాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని పింద్రంగి, మేడిచర్ల, పాతవలస గ్రామాల్లో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్) భవనాలు నిరుపయోగంగా ఉండిపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఏ.కోడూరులో శిథిలమైన పిఎసిఎస్ భవనాన్ని ఇదివరకే తొలగించారు. అక్కడ పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదించారు. కె.కోటపాడు, చౌడువాడ పిఎసిఎస్‌లను సొంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. మేడిచర్ల, పాతవలస, పింద్రంగి గ్రామాల్లోని పిఎసిఎస్‌లు మూసి వేసి కె.కోటపాడు పిఎసిఎస్‌లో కలిపివేయడంతో ఈ భవనాలు నిర్వహణ లేక పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ వహించి నిరుపయోగంగా ఉన్న భవనాలను తొలగించి ఇతర ప్రభుత్వ అవసరాలకు ఆ స్థలాలను ఉపయోగించాలని మండలంలోని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న పాతవలస పిఎసిఎస్ భవనం

వైసిపి అభ్యర్థుల ముమ్మర ప్రచారం

ప్రచారం చేస్తున్న జోగులు

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి జగన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని రామచంద్ర పాలెం, బికేపల్లి గ్రామాలను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మండలంలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివి సూర్యనారాయణ రాజు, మండల వైసిపి అధ్యక్షులు శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు దత్తుడు రాజు, స్థానిక సర్పంచ్ పరదేశమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీ, సర్పంచులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం నర్సీపట్నం మున్సిపాలిటీ 3వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి కరపత్రాలు అందజేసి మళ్లీ గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అయ్యన్నపాత్రుడు 1983లో శాసన సభ్యులు కాకముందు ఆస్తులు, ఇప్పుడున్న ఆస్తులు ఎన్ని వేల కోట్లో చెప్పాలన్నారు. 1994 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాయకులు అందరూ చందాలు వేసుకొని అయ్యన్నకు జీపు కొనిచ్చారని, ఇప్పుడు ప్రతీ ఒక్కరికి జీపులు కొనిచ్చే స్థాయికి ఆస్తులు ఎలా కూడబెట్టావని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ చెక్కా బాలమ్మ, వార్డు నాయకులు మామిడి అరుణ, మామిడి శ్రీను, మర్రా నాగరాజు, మరిడియ్య, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని, టౌన్ వైసీపీ అధ్యక్షులు ఏకా శివ, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న గణేష్

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

బికె పల్లిలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

యండపల్లిలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

ప్రజాశక్తి-కోటవురట్ల:
నాటి ప్రభుత్వం గ్రామ గ్రామాన సంపద సృష్టి కేంద్రాల పేరుతో వ్యర్థ పదార్థాల నిర్వహణపై ఆదాయం కోసం నిర్మించిన ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండల వ్యాప్తంగా 19 సచివాలయాల్లో దాదాపు ఈ సంపద తయారీ కేంద్రాల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ కేంద్రాలు వృధాగా పడి ఉన్నాయి. ఉపాధి హామీ, పంచాయతీ నిధులతో నిర్మించిన ఈ కేంద్రాలను ప్రస్తుతం అధికారులు, నాయకులు ఎవరూ పట్టించుకోక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. పలు కేంద్రాలలో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఈ కేంద్రాలు వృధాగా ఉండటంతో స్థానికులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం చేపట్టిన కేంద్రాల వద్దకే చెత్తను తీసుకొచ్చి తగలబెట్టడం వల్ల వచ్చే పొగ తో సమీప ప్రాంత వాసులు అల్లాడిపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పలు గ్రామాలకు చెందిన పలు సంఘాల నేతలు, ప్రజలు కోరుతున్నారు.

ప్రచారం చేపడుతున్న నాయకులు

కూటమి నేతల ప్రచారం

ప్రజాశక్తి - మాడుగులు: మండలంలోని ఎం కృష్ణాపురం గ్రామంలో కూటమి ఉమ్మడి అభ్యర్థులు పైల ప్రసాద్‌రావు, సీఎం రమేష్‌లను గెలిపించాలని తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేవుడు, జనసేన పార్టీ అధ్యక్షులు శివాజీ, ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, పాల్గొన్నారు.

ఇసుక, భూ కబ్జాల పేరుతో అరాచకాలు

- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఇసుక, భూ కబ్జాల పేరుతో ఎమ్మెల్యే గణేష్ చేసిన అరాచకాలు నియోజకవర్గ ప్రజలకు తెలుసని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గురువారం నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాతవరం మండలంలో ఒక మహిళ భూమిని కబ్జా చేయలేదా అన్నారు. గడపగడపకు పర్యటనలో నీలంపేట వెళ్లినప్పుడు సమస్యల కోసం ప్రశ్నించిన మహిళ ఇంటిని కూల గొట్టించ లేదా అని ప్రశ్నించారు. ఇలాంటి అరాచకాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. మరిడమ్మ పండుగను ఎండోమెంట్ పేరుతో ఆపాలని చూస్తున్నారన్నారు. గత మరిడమ్మ పండుగలో అమ్మవారి అభరణాలు ఎందుకు ఇవ్వలేదని

మాట్లాడుతున్న విజయ్

ప్రశ్నించారు. నాతవరం జూనియర్ కళాశాల తీసుకు వస్తానని మోసం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నా

సమస్యలు పరిష్కరించాలని..

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి:తమ గ్రామాలకు రోడ్డు, తాగునీటి వంటి సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. టీడీపీ, వైసీపీ పార్టీలకు ఓట్లు వేసి మోస పోయామని గుమ్మ పంచాయతీ ఫోర్లు, కరకవలస, కొత్తూరు పంచాయతీ బూసిపాడు, టెంకెబుడ్డి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బూసిపాడును సందర్శించిన సీపీఎం నాయకులు వంతల బుద్రయ్యతో కలిసి గిరిజనులు కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాదల చిన్నరావు, పట్టం భీమయ్య, బోయిన అప్పారావు మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తమ గ్రామాలకు రోడ్డు, తాగునీటి తదితర సౌకర్యాలు కల్పిస్తామని కచ్చితమైన హామీ ఇచ్చిన వారికే ఓట్లు వేస్తామని తెలిపారు. తమ కోసం పోరాటం చేసే పార్టీకే మద్దతు అని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయ పార్టీల నేతలు వస్తున్నారని, గెలిచిన తర్వాత తమ గ్రామాలను కనీసం పటించుకున్న నాదుడే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

పార్టీ కండువా వేస్తున్న అనిత

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని నెల్లిపూడికి చెందిన పలువురు టిడిపిలోకి చేరారు. నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లో గురువారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నెల్లిపూడికి చెందిన 30 కుటుంబాలు వై సిపి వీడి టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి తో కొత్త ప్రభుత్వం ఏర్పడబోతుందని అన్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామం నుండి టీడీపీ లో చేరిన ప్రతీ ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ లో చేరిన చేరిన వారికి అభినందనలు తెలిపారు.

మహాలక్ష్మినాయుడుకు పురస్కారాన్ని ఇస్తున్న అధికారులు

మహాలక్ష్మి నాయుడుకు పురస్కారం

ప్రజాశక్తి - కొత్తకోట:రావికమతం మండలం మేడివాడ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష - పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల పిల్లలకు టాబ్స్ ఉపయోగించి ప్రత్యేక విద్య అందించడం, విజన్ 2025 - ఇన్ క్లూజివ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష రాష్ట్ర కీ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడుకి పురస్కారాన్ని అందజేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరెడ్డి, అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి. శ్రీనివాసులు రెడ్డి, ఏపీ సమగ్ర శిక్ష సహిత విద్య స్టేట్ అబ్జర్వర్ రామ్ కమల్, ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య విభాగం అధికారి డాక్టర్ వై.నరసింహం చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మహాలక్ష్మి నాయుడు ను మేడివాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, మండల దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు అభినందించారు.

దగ్ధమవుతున్న అటవీ ప్రాంతం

ఆరిలోవ అటవీ ప్రాంతంలో మంటలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఆరిలవ అటవీ ప్రాంతంలో గురువారం సాయంత్రం మంటలు చెల రేగాయి. ప్రధాన రహదారిని ఆనుకొని ఎదురు పొదలు ఉన్న ప్రాంతలో మంటలు చెలరేగి అడవి కాలి పోయింది.

అనారోగ్యంతో బాలిక మృతి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని నుర్మతి గ్రామంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అనారోగ్యంతో 8వ తరగతి చదువుతున్న బాలిక మృతి చెందింది. స్థానికుల అందించిన వివరాలు..ఈనెల 8న అనారోగ్యం కారణంగా పాఠశాల నుండి తన సొంత గ్రామం అమ్మడేలు గ్రామానికి బాలిక వచ్చింది. ఆరోగ్యం కుదుటపడక పోయినా పాఠశాలలో పరీక్షలు ఉండటంతో తిరిగి తల్లిదండ్రులు 10న పాఠశాలకు తీసుకెళ్లారు. పాఠశాలలో 11న మృతి చెందింది.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైసిపి నేతలు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన పెదతీనార్లలో గురువారం వైసిపి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నక్కపల్లి పిఏసిఎస్ పర్సన్ ఇన్చార్జి తాతబాబు తదితరులు హాజరై మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గం వైసిపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి ముత్యాల నాయుడు గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. రాజయ్యపేట మాజీ ఎంపీటీసీ సభ్యులు పిక్కి తాతియ్యలు, యూత్ లీడర్ పిక్కి కోటి తదితరులను పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏరిపిల్లి నగేష్, గొర్ల బాబురావు తదితరులు పాల్గొన్నారు .

కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కృష్ణారావు

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని గొలుగొండ ఎస్సై బి.కృష్ణారావు కోరారు. గురువారం రావణాపల్లి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలకు దిగరాదని చెప్పారు.

ప్రతిభ కనబరుస్తున్న గిరిపుత్రులు

ప్రజాశక్తి-పాడేరు:వివిధ పోటీ పరీక్షల్లో గిరిజన యువత సత్తా చాటుతున్నారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ నిర్వహించిన గ్రూపు-1, గ్రూపు -2 పరీక్షల్లో గిరిజన యువత మరోసారి ప్రతిభ కనబరిచి విజయాలు సాధించారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ గత ఏడాది నవంబరు నెలలో ప్రాజెక్టు లక్ష్య పేరుతో నిరుద్యోగ గిరిజన యువతకు వేపగుంట వైటిసిలో అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి సివిల్స్ ఉచిత శిక్షణను ప్రారంభించారు.

ఐటిడిఏ సౌజన్యంతో రాజమండ్రి 21 వ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 64 మంది గిరిజన యువతీ, యువకులకు సివిల్స్, గ్రూప్ 1, గ్రూప్ -2, పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నారు. ఉత్తమ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో అవసరమైన కోచింగ్ అందిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఈనెల 10 వ తేదీన విడుదల చేసిన గ్రూపు -2 ప్రిలిమినరీ పరీక్షలకు 59 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో 43 మంది గ్రూపు -2 మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. గత ఏడాది నిర్వహించిన గ్రూపు 1లో చిట్టపులి జీవన, నవ్యసాయి గౌరి ఐటిడిఏ శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించారు.

గిరిజన యువతకు గొప్ప సదవకాశం : పిఒ

ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ మాట్లాడుతూ, ఐటిడిఏ నేతృత్వంలో వేపగుంట వైటిసిలో ఉచితంగా గిరిజన యువతీ, యువకులకు సివిల్స్ శిక్షణ అందిస్తున్నామన్నారు. 21 వ సెంచరీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పలువురు ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నారని తెలిపారు. అదే స్ఫూర్తితో 2023 నవంబరులో రెండవ సారి సివిల్ ఉచిత శిక్షణను ప్రారంభించామని, సివిల్స్ ఉచిత శిక్షణను 9 నెలలు కొనసాగిస్తామన్నారు. ఉత్తమ శిక్షణ అందిస్తున్నామన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- విలేకర్ల బృందం:

మహాత్మ జ్యోతిరావు పూలేను జయంతిని అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే ఆదర్శాలను ఆచరిస్తూ సమాజంలో మిగిలి ఉన్న అసమానతలు రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ పలువురు అధికారులు, నేతలు పిలుపునిచ్చారు.

విశాఖ కలెక్టరేట్ : సామాజిక అసమానతలు తొలగించేందుకు, బిసిల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ సభ్యులు కొనియాడారు. గురువారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లా కోర్టు కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఎంసి అధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జెవి.ప్రభాకర్ మాట్లాడారు. కోశాధికారి జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఇంటి గురుమూర్తి, కడితి సాధు, పి.రాంబాబు, బి.గౌతమ్ బాబు, అప్పుకొండ, అలమండ ప్రసాద్, కాంతారావు, సరస్వతి పాల్గొన్నారు. పూలేకి విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పూలే గొప్పతనాన్ని వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రామారావు, బిసి సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు. గ్రీన్ పార్క్ హోటల్ రోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పూలమాల వేసి నివాళ్లర్పించారు. దాదాపు రెండు శతాబ్దాల క్రితమే సంస్కరణ వాదాన్ని ముందుకు తీసుకువచ్చి అణగారిన తరగతుల వారికి, ముఖ్యంగా భారతదేశంలోని కోట్లాదిమంది శూద్రులకు విద్యాబుద్దులు నేర్పడానికి కృషి చేసిన గొప్ప త్యాగజీవి జ్యోతిరావు పూలే అని అన్నారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఐ పశ్చిమ అసెంబ్లీ అభ్యర్థి అత్తిలి విమల పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అదనవు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, డాక్టర్ వై.శ్రీనివాస రావు, ఎస్ఎస్.వర్మ, ప్రధాన ఇంజినీర్ పి.రవికృష్ణరాజు, సెక్రటరీ నల్లనయ్య పాల్గొన్నారు.

విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి ఉపకులపతి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణ కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

మధురవాడ : ఎండాడలోని వైసిపి కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి,

విశాఖలో నివాళి అర్పిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విఎంఆర్డిఎ ఛైర్మన్ సనపల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆధ్వర్యాన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, రెయ్యి వెంకటరమణ, నాయకులు జోగినాయుడు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో విగ్రహానికి చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామచంద్రప్రసాద్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ములగాడ : మల్కాపురంలోని నవజ్యోతి మహిళా మండలి ఆవరణలో జ్యోతిరావుపూలే జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజ్యోతి మహిళా సేవా సంఘం డైరెక్టర్ సిస్టర్ సంగీత, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, మహిళా మండలి యానిమేటర్లు హేమలత, విజయ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : మాధవధార ఉడాకాలనీలోని జ్యోతీరావు పూలే విగ్రహానికి ఏపీ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకట్రావు పూలమాల వేసి నివాళులర్పించారు. సామాజిక విప్లవాల పితామహుడు మహాత్మ జ్యోతీరావు పూలే అని పేర్కొన్నారు.

మాడుగుల: బహుజనులు అన్ని రంగాల్లో సమానత్వం సాధించేలా కృషి చేయడమే జ్యోతిరావు పూలేకు ఘనమైన నివాళి అని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ అన్నారు. గురువారం స్థానిక గాంధీ పార్కులో భారతీయ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతిని ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో బహుజన కులాలు అన్ని రంగాల్లో సమానత్వం సాధించేలా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ ఎంపిపి రామధర్మజ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవరపల్లి శ్రీను, టౌన్ నాయకులు బొమ్మిశెట్టి శ్రీనివాస్, మహమ్మద్ ఉన్నీసా, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని బుడ్డడపాడు గ్రామంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు జ్యోతి రావుపూలే కృషి చేశారన్నారు. బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమలో సిపిఎం నేతలు రాజుబాబు, బాలరాజు, పండియ్య ,రాజు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో...

అనకాపల్లి:మహాత్మ జ్యోతిరావు పూలే ఆదర్శాలను ఆచరిస్తూ సమాజంలో మిగిలి ఉన్న అసమానతలు రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతిరావు పూలే 198వ జయంతోత్సవంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పూలే చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.దయానిధి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కే.రాజేశ్వరి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్‌లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో కూటమి అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్ పాల్గొని నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. సిపిఐ నాయకులు రాజాన దొరబాబు



మాడుగులలో నివాళి అర్పిస్తున్న నాయకులు

తదితరులు పూలే చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో పూలే చిత్రపటానికి మాడుగుల కూటమి అభ్యర్థి పైలా ప్రసాదరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటారావు, నెక్కల్ల నాగమణి పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి, సోమవారం సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతిన చిరంజీవి, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కర్రి దుర్గ నాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : భారతదేశంలో తొలిసారి మహాత్మా బిరుదు పొందిన వ్యక్తి జ్యోతిబాపూలే అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పాల్తేటి పెంటారావు కొనియాడారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో నక్కల నాగమణి, వసంత అప్పారావు, నర్సిరెడ్డి అక్కునాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని కాంప్లెక్స్ సముదాయంలో పూలే విగ్రహానికి ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు పూలమాల వేశారు. కార్యక్రమంలో జెడ్పిటిసి లాలం రాము, వైసిపి నాయకులు కూండ్రపు వెంకునాయుడు, పల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యాన

అచ్యుతాపురం : సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం అచ్యుతాపురంలో జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. మండల సముదాయంలో పూలే విగ్రహానికి యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట అప్పారావు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. దేశంలో సామాజిక న్యాయం, మహిళా సాధికారత ఉద్యమాలకు ఆద్యుడు పూలే అని పేర్కొన్నారు. జిల్లా సిఐటియు అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ చదువులతోనే సమన్యాయం, అభివృద్ధి సాధ్యమని నమ్మిన మహాత్ముడు పూలే అని చెప్పారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కార్యదర్శి రామ్ కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, మండల కార్యదర్శి కూండ్రపు సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం బీసీ కాలనీలో జ్యోతి రావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ, నాయకులు ఏ వరలక్ష్మి, సిహెచ్ వరాలమ్మ, ఏ అన్నపూర్ణ, పుష్ప, అనిత, లక్ష్మి ఈశ్వరమ్మ తదితర్లు పాల్గొన్నారు.

గొలుగొండలో...